# బిజెపిని, దాని మిత్ర పార్టీలను తిరస్కరించండి

# పాలకవర్గ పార్టీలను ఎండగట్టండి

# ప్రజాస్వామిక శక్తులను బలపరచండి

## సిపిఐ(ఎంఎల్) కేంద్ర కమిటీ ప్రకటన

**రాజస్థాన్,** మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, మిజోరం, తెలంగాణ–ఈ ఐదు రాష్ట్రాలలో 2018 నవంబరులో ఆయా రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగబోతున్నాయి. వీటిలో తెలంగాణ మినహా మిగిలిన నాలుగు రాష్ట్రాలలో ప్రస్తుతం బిజెపి పాలన కొనసాగుతుండగా, తెలంగాణాలో తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలో ఉంది.

పాలకవర్గాలు తమ ప్రజావ్యతిరేక విధానాలను కప్పిపుచ్చు కునేందుకు, మౌలిక సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకు తమ రాజకీయ ప్రతినిధుల ద్వారా కుల, మత, ప్రాంతీయ తత్వాలను రెచ్చగొడుతూ, వాటిని అసహనాల స్థాయికి పెంచి, ప్రజలను చీల్చి వారి ఐక్య శక్తిని దెబ్బతీస్తున్నాయి.

రాజస్థాన్‌లో గోరక్షణ పేరుతో ముస్లింలపై పెద్దఎత్తున హత్యాకాండ కొనసాగింది. ఈ రాష్ట్రాలలో బిజెపి, ఆరెస్సెస్ దళితులపై, మహిళలపై దాడులను నిరంతరాయంగా కొనసాగించాయి. తెలంగాణా రాష్ట్ర సమితి నాలుగు సంవత్సరాల విభజన అనంతరం కూడా ప్రాంతీయతత్వాన్ని రెచ్చగొట్టటం ద్వారా సురక్షితంగా అధికారంలోకి రావాలని చూస్తోంది.

ఈ ఐదు రాష్ట్రాలలోనూ ఇప్పటిదాకా అధికారంలో ఉన్నవాళ్ళు, తమ పాలనా కాలంలో ప్రజల మౌలిక సమస్యలను కనీసం తాకనన్నా తాకలేదు. బిజెపి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని హామీ ఇచ్చింది. కానీ నీతి ఆయోగ్ ద్వారా ఒక విధాన పత్రాన్ని విడుదల చేయటం తప్ప అది చేసింది శూన్యం. అదే సమయంలో రైతాంగం తమ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కోరుతూ ప్రదర్శనలు చేసినప్పుడు మధ్యప్రదేశ్‌లోను, రాజస్థాన్‌లోను తీవ్ర అణచివేత ప్రయోగించారు. యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మబలికారు. కానీ గత నాలుగేళ్లలో ఉద్యోగాల కల్పన తగ్గుతూ వచ్చింది. ఈ ప్రభుత్వాలు ప్రజలందరకు విద్య, వైద్యం, ఆరోగ్య సేవలందించే బాధ్యత నుండి వైదొలగి, ఆయా రంగాలను మార్కెట్ శక్తులకు అప్పగించాయి. ఫలితంగా పేదలకు విద్య, వైద్యం అందుబాటులో లేకుండా పోగా, మధ్యతరగతి వారికి అవి భారంగా మారాయి.

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంతో చేతులు కలిపి, ఈ రాష్ట్రస్థాయి పార్టీలు జిఎస్‌టివంటి విధానాలను అమలుచేసి ప్రజలపై ఊహించలేనంత ఆర్థిక భారాలను మోపాయి. ప్రజలు చెమటోడ్చి సంపాదించుకున్న, బ్యాంకులలో దాచుకున్న పొదుపు మొత్తాలను, రాష్ట్ర బడ్జెట్లను బడా పారిశ్రామికవేత్తలు కొల్లగొట్టినా నోరుమెదపని వీరు, ఇప్పుడు బ్యాంకులను నష్టాల నుండి గట్టెక్కించటానికి ప్రజలపై కొత్త కొత్త పన్నులు విధిస్తున్నారు.

కేంద్రంలోని బిజెపి తమ అధికారాలను హస్తగతం చేసుకుంటున్నా ఈ ఐదు రాష్ట్రాలలో అధికారంలో ఉన్న పార్టీలు కనీసం నోరు మెదపలేదు. నరేంద్ర మోడీ ప్రభుత్వం భూసేకరణ చట్టంలో సవరణలను ప్రతిపాదించినప్పుడు దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. అప్పుడు ఈ రాష్ట్ర ప్రభుత్వాలు భూసేకరణ చట్టాలకు స్వంత సవరణలు చేసి రైతాంగం నుండి భూములను గుంజుకునే క్రమాన్ని సులువు చేశాయి. ఈ రాష్ట్ర ప్రభుత్వాలు చడీచప్పుడు లేకుండా కార్మిక చట్టాలలో పెట్టుబడిదారులకు అనుకూలమైన మార్పులు తీసుకువచ్చి కార్మికుల చట్టబద్ధ హక్కులను కాలరాశాయి.

ప్రతిపక్ష పార్టీలు, ప్రధానంగా కాంగ్రెసు, ఈ రాష్ట్రాలలో తిరిగి అధికారంలోకి రావటానికి ఏ చిన్న అవకాశాన్నీ వదిలి పెట్టటం లేదు. వాగ్దానాలు కురిపించటంలో అది బిజెపితో పోటీ పడుతోంది. ఈ పాలకవర్గ పార్టీలన్నీ తమ కండబలం, ధనబలంతో పాటు వివిధ ప్రజాకర్షక పథకాలపై ఆధారపడుతూ ప్రజలను బిచ్చగాళ్ళుగా మార్చి, వారి సహాయాలకై ఎదురుచూసే స్థితికి దిగజారుస్తున్నాయి. సామ్రాజ్యవాదుల, బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలను నెరవేర్చటంలో కాంగ్రెసు, బిజెపి, ప్రాంతీయ పార్టీలన్నీ ఒక్కటిగానే ఉన్నాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నామమాత్రంగా విభేదిస్తాయి తప్ప, ప్రజా వ్యతిరేక విధానాల పట్ల వీరందరి అభిప్రాయం ఒకటే.

ఈ రాష్ట్రాలలో గత ప్రభుత్వాలన్నీ కూడా ఫాసిస్టు తరహా అణచివేతను అమలుపరచినవే. బిజెపికి, దాని మాతృసంస్థ ఆరెస్సెస్‌కు ప్రజలలో కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను రగిల్చి, వారిని చీల్చి ఉంచటానికి హిందుత్వ నినాదం ఒక ఆయుధంగా మారింది. ప్రజల కోపాన్ని చల్లార్చేందుకు వారు కొన్ని ఉపశమన చర్యలు చేపడుతున్నారు కానీ ప్రస్తుత సాంఘిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థను కొనసాగించేందుకే వారు కట్టుబడి ఉన్నారు.

భారత ఆర్థిక వ్యవస్థ తిరోగమనంలో ఉండటం, దాని ఫలితమైన పేదరికం, ప్రజల కడగండ్లు ప్రస్తుత అర్థవలస, అర్థఫ్యూడల్ సమాజపు ఫలితాలు. ఈ వ్యవస్థ మారి ప్రజాతంత్ర వ్యవస్థ ఏర్పడనిదే ప్రజల జీవితాల్లో ఏ విధమైన అభివృద్ధి జరగదు. అర్థఫ్యూడల్ దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా, సామ్రాజ్యవాద దోపిడీకి, పెత్తనానికి వ్యతిరేకంగా ప్రజలు సంఘటితపడి పోరాటం సాగించాల్సిందిగా మేం పిలుపునిస్తున్నాం.

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ప్రస్తుత సందర్భంలో ప్రజలకు ఈవిధంగా పిలుపునిస్తున్నాం.

- **బిజెపిని, దాని మిత్రులను తిరస్కరించండి.**
- **కాంగ్రెసు మరియు ఇతర పాలకవర్గ పార్టీల వర్గస్వభావం పట్ల అప్రమత్తంగా ఉండండి.**
- **ప్రజాతంత్ర శక్తులు పోటీ చేస్తున్న చోట వారిని బలపర్చండి; వారికి ఓటు వేయండి.**
- **పాలకవర్గాల ఫాసిస్టు పద్ధతులకు వ్యతిరేకంగా కార్మికులు, రైతాంగం, అణగారిన ప్రజలంతా సంఘటితంగా పోరాడండి.**

**విప్లవాభినందనలతో**

**విశ్వం**
**ప్రధాన కార్యదర్శి**
**కేంద్ర కమిటీ, సి.పి.ఐ.(ఎం.ఎల్)**

**15-10-2018**

**0000**